

# ఎవరైతేనేం

కె. ప్రవీణ



సితార్ వింటూ ఉయ్యాల బల్లపై బోర్లా పడుకొని పుస్తకం చదువుతోంది హరిణి. మంచి ముత్యపు రంగుకు కెంపు బార్డరు వున్న చీరకట్టుకుంది. గులాబీ రంగులో నాజుగ్గా వున్న ఆమె పాదాలు సితార్ వాయిద్యానికనుగుణంగా ఊగుతున్నాయి. కాళ్లనంటి పెట్టుకున్న సన్నని బంగారపు పట్టీలు ఆమె చర్మపు కాంతిలో వెలవెలబోతున్నాయి. మెడ వెనుకగా భుజాల మీదుగా నడుం వరకూ వదిలేసిన కురులు కిటికీ లోంచి వస్తున్న వెలుగుకు రాగి రంగులో మెరుస్తున్నాయి. జుట్టు అలా వదులుకోవడంలో నుదుటి మీదుగా కళ్లపైకి జారుతున్న ముంగురులను నాజూకైన వేళ్లతో పైకి అనుకుంటోంది. అప్పుడామె వేలికున్న ఒంటి రవ్వ ఉంగరం చమక్కుమంటోంది.

అపూర్వ పుస్తక సేకరణ
స్వామి: డా॥ వెలగా వెంకటప్పయ్య
అలమూరి విక్రమ్, సజ్జావారిపాలెం,
తెనాలి. Cell : 939205...



విశాలమైన ఆమె కళ్లు పుస్తకంలోని వాక్యాలపై కదులుతూ మధ్య మధ్య గోడ గడియారం వంక చూస్తున్నాయి. ఒత్తయిన ఆమెకనుబొమలు, సన్నటి పొడవైన నాసికతో ఆమె ముఖం ఎంతో ఆకర్షణీయంగా వుంది. ఆమె తలలో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు ఆమె అందానికి హుందాతనాన్ని ఆపాదిస్తున్నాయి. బయట వేసవి ఎండ మండిపోతున్నా లోపల సెంట్రల్ ఏసిలో వున్న ఆమె మంచులో తడిసిన నందివర్ధనంలా వుంది. ఆ ఇంట్లో గోడలకు తెలుపురంగు వేసి వుంది. సోఫాలూ, కుర్చీలూ, తెల్లని అపోల్‌స్టరీతో వున్నాయి. పెద్ద పెద్ద అద్దాల కిటికీలకు పాలనురగ లాంటి లేసు పరదాలు వున్నాయి. ఎటు చూసినా ధవళ వర్ణమే. అదామె స్వచ్ఛమైన మనసును ప్రతిబింబిస్తున్నట్టుగా వుంది.

గోడ గడియారం సంగీతభరితంగా రెండు గంటలు కొట్టింది. ఆ శబ్దం వినగానే ఆమె ఒక్క ఉదుటున లేచింది. పరుగులాంటి నడకతో బయటకి వెళ్లింది. గేటుకు బిగించి వున్న పోస్ట్ బాక్స్‌ని ఆత్రంగా తెరిచింది. అది ఖాళీగా వుంది. ఆమె ముఖంలో నిరాశ చోటుచేసుకుంది. వెనక్కి తిరిగి మెల్లగా నడుస్తూ ఇంట్లోకి వెళ్లింది. ''...... ఉత్తరం రాలేదెందుకని?'' ఆమె మనసు ఆలోచనలో పడింది. ''ఆరు నెలలుగా ప్రతి శుక్రవారం ఠంచనుగా వచ్చే ఉత్తరం ఈరోజు రాలేదెందుకో...?''

ఇప్పుడు సప్త సముద్రాల కావల.... హరిణి మనసూ, తనువూ పిల్లల స్పర్శ కోసం తపించిపోతున్నాయి. ఒకే పళ్లెంలో గోరు ముద్దలు కలిపి తినిపించాలని ఆరాట పడుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ హరిణి చుట్టూ వున్న ఒంటరితనం ఆమెలో స్తబ్ధతను కలిగించింది. కానీ ఇప్పుడా స్తబ్ధతను కరిగిస్తున్న ఆ ఉత్తరం..... ఆ తర్వాత మరో ఉత్తరం...

అసలు ఆ ఉత్తరాలు రాస్తుందెవరో కూడా ఆమెకుతెలియదు. కానీ ఆరునెలల క్రితం ఎప్పటిలాగా పని కుర్రాడు ఆనాటి పోస్టు తెచ్చాడు. అందులో ఎక్కువగా కట్టాల్సిన బిల్లులూ అవే వుంటాయి. ఆరోజు తన పేరున ఓ ఉత్తరం వచ్చింది. తనకు ఉత్తరాలు రాసేవాళ్లెవరూ లేరు.

అమెరికాలో వున్న పిల్లలిద్దరూ ఫోన్లూ, ఈ-మెయిల్ చేస్తారే కానీ ఉత్తరాలు రాయరు. ఎవరై వుంటారూ... ఆమె కళ్లు ముత్యాల్లాంది వాక్యాల వెంట కదిలాయి. ఏకబిగిన చదివింది. ఉత్తరం చివర శ్రేయోభిలాషి అని వుంది.

ఎవరై వుంటారు? ఒక్క క్షణం మాత్రం ఆలోచించింది. రాసిందెవరో కానీ తన మనస్థితినెరిగి రాశారు. మనసుకు స్పృశించిన ఆ ఉత్తరాన్ని మళ్లీ చదివింది.

అలా మళ్లీ మళ్లీ చదివింది. ఎన్నిసార్లు చదువుకుందో లెక్కేలేదు.

అలా చదివిన ప్రతిసారీ ఆమె మనసులో పేరుకుపోయిన దిగులు తరిగిపోతున్నట్లుగా అనిపించింది.

ఆమె ఓసారి ఆ ఉత్తరంలోని వాక్యాల్ని మననం చేసుకుంది.

''జీవితం తనను తాను పొడిగించుకోవాలనే జీవితేచ్ఛకు రూపం బిడ్డలు. వాళ్లు నీ ద్వారా వచ్చారే కానీ, నీ నుంచి మాత్రం కాదు. నీతోనే వున్నా వాళ్లు నీకు చెందరు.

వాళ్లకు నీ ప్రేమను పంచగలవే కానీ నీ ఆలోచనల్ని కాదు.

వాళ్లకు వాళ్లవయిన ఆలోచనలుంటాయి.

నీ ఇంట్లో వాళ్ల శరీరాలుంటాయేకానీ, వాళ్ల ఆలోచనలనూ, కోరికలనూ వుంచలేవు. వాళ్ల ఆలోచనలు రేపటి ఇంట్లో నివసిస్తూ వుంటాయి. నీ కలల వూహల్లో కూడా నీవా ఇంటిఛాయలకైనా వెళ్లజాలవు. వాళ్లలా వుండడానికి నువ్వు ప్రయత్నించవచ్చు. కానీ నీలా వాళ్లను తయారు చెయ్యాలని శ్రమించకు. జీవితం ఎప్పుడూ వెనక్కి నడవదు. నిన్నతో కలిసి చతికలబడదు. మీరు విల్లయితే. ఆ విల్లు నుంచి దూసుకు పోయిన శరాలు మీ పిల్లలు...''

ఆ ప్రవక్త చెప్పిన మాటలు ఇవి. మీకు దూరదేశంలో వున్న మీ పిల్లలు తలపుకు వచ్చినప్పుడల్లా మననం చేసుకోండి. మనసు తేలిక పడుతుంది.

నిజమే ఆ వ్యక్తి రాసినట్లుగానే తన మనసులోని కలలు కరిగిపోతున్నాయనే భావన కలుగుతుంది.

''నీ ఇంట్లో వాళ్ల శరీరాలుంటాయి. కానీ, వాళ్ల ఆలోచనలనూ, కోరికలనూ వుంచలేవు.''

అక్షరాలా అది నిజమే...! ఆమె కళ్ల ముందు దూరదేశంలో వున్న కొడుకూ, కూతురూ మెదిలారు. వాళ్లను ఇక్కడి నుంచి వెళ్లకుండా ఆపగలిగేది. కానీ వాళ్ల ఆలోచనలనూ కోరికలనూ నియంత్రించగలిగేదా? తన కొడుకు 'ఆదర్శ్' చాలా బ్రిలియంట్... వాడి తెలివితేటలకు స్కూల్లో టీచర్లే ఆశ్చర్యపోయేవాళ్లు. వాడికి కారు డిజైన్ చేయాలనే కోరిక వుంది. శిక్షణ కోసం పద్దెనిమిదవ ఏటే జర్మనీ వెళ్లాడు. అక్కడే ఓ పెద్ద కారు కంపెనీ వాళ్లు వాడి నైపుణ్యం గుర్తించారు. ఆ కంపెనీవాళ్లే స్పాన్సర్ చేసి తగిన శిక్షణ ఇచ్చారు. మంచి జాబ్ ఆఫర్ చేశారు. ఇరవై ఏళ్ల వయస్సులోనే వాడెంతో సాధించాడు. ఇంకా ఎత్తుకు ఎదగాలనే తృష్ణ....వాడలా ముందుకు దూసుకెళుతూనే వున్నాడు. కంపెనీ వాళ్లే పై చదువులకు అమెరికా పంపారు.... అసలు అక్కడ తన ప్రమేయం ఏం లేదు. అలా జరిగిపోతూనే వుంది. ఇక అమ్మాయి 'అదితి' విషయానికి వస్తే ఇంటర్ పూర్తవుతూనే పై చదువులకు అమెరికా వెళతానని పోరు పెట్టింది. అక్కడి యూనివర్శిటీలకు అప్లయ్ చేయడం...అడ్మిషన్ రావడం... అంతా అయ్యాక తన నిర్ణయానికి విలువేముంటుంది? అయినా తను చెప్పింది. ''గ్రాడ్యుయేషన్‌కే అయితే ఇక్కడా మంచి కాలేజీలే వున్నాయి కదా...!''

ఎస్ మమ్మా.... ఇక్కడ మంచి కాలేజీలే వున్నాయి. కానీ నాకక్కడ హార్వర్డ్ యూనివర్శిటీలో సీటు వచ్చింది. మామ్ నా కెరీర్ ఎలా మలుచుకోవాలీ అనే అవగాహన మీ కంటే నాకే ఎక్కువగా వుంటుంది. కదా...!'' అన్నది. మృదువుగానే చెప్పినా ఖచ్చితమైన నిర్ణయం ధ్వనించింది. 'అదితి' అలా అంటుంటే.... ఎంత ఎదిగింది అనిపించింది. తనకు పద్దెనిమిదేళ్లకే పెళ్లయింది. ఇంకా చదువుకుంటాను మొర్రో అంటుంటే తన మాటలెవరూ పట్టించుకోలేదు. అమ్మానాన్నలు మంచి సంబంధం వచ్చిందంటూ మహీధర్‌తో పెళ్లి జరిపించారు. ఇరవై ఏళ్లకే ఇద్దరు బిడ్డల తల్లయింది. లేబర్‌రూంలో పురిటి నొప్పులు పడడం నిన్నమొన్ననే జరిగినట్లుగా వుంది. తన పేగు తెంచుకొని పుట్టిన పసికందులు అప్పుడే ఎంత పెద్దవాళ్లయ్యారు. తనింకా వాళ్లకు తినడం కూడా సరిగ్గా తెలియదనుకొని గోరుముద్దలు కలిపి పెట్టాలనుకుంటుంది.

ఇద్దరు పిల్లలూ వెళ్లిపోయారు. తనిక్కడ ఒంటరిగా... ఈ ఒంటరితనం ఎంత భయంకరం..... ఇంట్లో ఎటు చూసినా పిల్లల జ్ఞాపకాలే... ఎగ్జామ్స్‌కి చదివీ చదివీ అలసిన ఆదర్శ్ తన ఒళ్లో సేదతీరేవాడు... వాడు తన ఒళ్లో పడుకోవడమే ఆలస్యం అదితి వాడిని తోసేసి తను పడుకునేది. అలా అమ్మ నాదంటే నాదని పోట్లాడుకునే వాళ్లు ... ఇప్పుడు సప్త సముద్రాల కావల.... హరిణి మనసూ, తనువూ పిల్లల స్పర్శ కోసం తపించిపోతున్నాయి. ఒకే పళ్లెంలో గోరు ముద్దలు కలిపి తినిపించాలని ఆరాటపడుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ హరిణి చుట్టూ వున్న ఒంటరితనం ఆమెలో స్తబ్ధతను కలిగించింది. కానీ ఇప్పుడా స్తబ్ధతను కరిగిస్తున్న ఆ ఉత్తరం..... ఆ తర్వాత మరో ఉత్తరం...

హరిణీ,

అమ్మ ఒడిలోంచి ఈ విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన మీ పిల్లలు ఎక్కడో అక్కడ సుఖంగా వుండాలని కోరుకోవడం తప్ప మీరు వాళ్లకు చేయగలిగిందేమీ లేదు. తల్లి గర్భంలో ఊపిరి పోసుకున్న పిండం నెలలు నిండగానే ఈ భూమ్మీదికి రావాలని ఆరాట పడుతుంది. ఈ లోకంలోకి వచ్చి తల్లిపేగు తెంచుకునే ఆ రెప్పపాటు కాలంలోనే ఆ శిశువులో ఎన్నో మార్పులు సంభవిస్తాయి. ఈ విశాల ప్రపంచంలో తను ఎదగడం ప్రారంభిస్తుంది.... ఇక ఈ ఇరవై ఏళ్లుగా వాళ్లలో, వాళ్ల ఆలోచనల్లో ఎన్నెన్ని మార్పులు కలిగి వుంటాయో ఊహించండి. ఈ మార్పులన్నీ అతి సహజం. మీ ద్వారా ఈ లోకంలోకి వచ్చిన మీ పిల్లలను స్వార్థరహితంగా పెంచి పెద్దచేయడం, వాళ్ళకి మంచి, చెడు నేర్పడం మీ బాధ్యత. మీ పెంపకం పట్ల నమ్మకాన్ని మాత్రం కోల్పోవద్దు. ఇన్నాళ్లు వాళ్లను సంరక్షించడంలో మునిగి వాళ్లే లోకంగా భావిస్తూ బయటి ప్రపంచాన్ని విస్మరించారు. ఇప్పుడీ విశాల ప్రపంచంలోకి మళ్లీ అడుగుపెట్టండి. అందమైన ప్రకృతిని ఆస్వాదించండి. పిల్లగాలికి తలలూపే పూలబాలలు, కిలకిలారావాలతో పక్షులూ మిమ్మల్నెలా స్వాగతిస్తాయో గమనించండి.... చెట్టు చేమా కొండా, కోనా, జలపాతాలు, శిఖరాలూ, లోయలూ. నీలాకాశం, చుక్కలూ, చంద్రుడూ, సూర్యుడూ, సముద్రం, మంచుపర్వతాలూ, ఇలా ఎన్నెన్నో దృశ్యాలు వీటిల్లో ఏ ఒక్కటైనా మీ మనసును కదిలిస్తాయి. ఎన్నెన్నో వాయిద్యాలు. షహనాయి, వీణ, సితార్, మృదంగం, పిల్లనగ్రోవి, వీటిల్లో ఎన్నెన్నో నాదాలూ, రాగాలూ, స్వరాలూ వినండి. ఏ ఒక్కటైనా మీ మనసును రంజింపజేస్తుంది. ఎన్నో భాషలు, అక్షర మాలికలతో కూర్చిన గ్రంథాలూ, ప్రబంధాలూ, వేదాలూ... ఎంత తెలుసుకున్నా తరగని విజ్ఞానమనే నిధి వీటిల్లోదొరుకుతుంది. అది మీ

మనసును సాంత్వన పరుస్తుంది. నాట్యం, గానం, చిత్రం ఇలాంటి కళలెన్నో...శరీరంలో ఓపికుండాలే కానీ కళనభ్యసించేందుకు, అర్థం చేసుకునేందుకు వయసు అడ్డురాదు. ఇష్టమైన కళలో భాగమై ఒదిగి పొండి.


ఆ వుత్తరాల వెల్లువలో తనలోని స్తబ్దత పూర్తిగా కొట్టుకుపోయింది. తనువూ, మనసూ చైతన్యవంతమైనాయి. కొత్త 'హరిణి' ఊపిరిపోసుకుంది. వుత్సాహంతో వురకలు వేసే జలపాతమే అయిందామె. ఇప్పుడామె సితార్ వాయిద్యంపై మక్కువ పెంచుకుంది. పుస్తకాలెన్నో చదువుతోంది. తంజావూర్ శైలిలో చిత్రాలు వేయడం నేర్చుకుంటోంది. ఒకప్పటి శూన్యమైపోయిందనుకున్న జీవితం నేడామెకు రాగాలతో, రంగుల ఊహలతో కిక్కిరిసిపోయింది.... వుత్తరం... ఓ జీవం లేని వస్తువు... కానీ అందులోని అక్షరాలు మూతబోయిన మనసును స్పృశించి ఇంతటి చైతన్యాన్ని కలిగిస్తాయా? అవును, పైకి జడపదార్థాంలా కనిపించే ప్రతి విత్తనంలోనూ జీవం వుంటుంది. ఆవగింజంత మర్రి విత్తనం మహావృక్షానికి మూలం అవుతుంది. ఆస్వాదించే మనసుంటే అక్షరాలకుండే రంగూ రుచీ వాసనలను ఆనందించి అనుభవంలోకి తెచ్చుకోవచ్చు.... ఇలా ఎన్నోరకాలుగా ఆమె వూహించుకొంది. విశ్వంలోని గోళాలన్నీ ఒక్కొక్క అక్షరమై హరిణి కళ్ల ముందు వెలుగునీ, వెన్నెలనీ నింపుతున్నాయి. చిన్నప్పటి నుంచీ తాను వింటున్న మంత్రాక్షర బీజాక్షర ఉచ్ఛారణలతో రోదసీ ప్రతిధ్వనిస్తోంది.

***

అది పిట్స్‌బర్గ్‌లో ఓ బహుళ అంతస్థుల భవనం. పెంట్‌హౌజ్‌లో స్టడీ టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చుని వుత్తరం రాయడంలో లీనమయ్యాడు లూయిస్....రాయడం పూర్తయ్యాక అతని నీలికళ్లు ఓసారి ఆ వుత్తరంలోని వాక్యాల వెంట కదిలాయి. సంతృప్తిగా తలాడించాడు. దాన్ని మడిచి కవర్లో పెట్టాడు. అంటించిన కవరుపై హరిణి పేరూ, అడ్రస్ రాశాడు. టేబుల్‌పై ఓ పక్కగా వున్న రెండు చిన్న పక్షి బొమ్మల్ని చేతిలోకి తీసుకున్నాడు. క్రిస్టల్‌తో తయారైన పక్షిపిల్లలు అవి. తళతళ మెరుస్తూ ముద్దొస్తున్నాయి. వాటిని చేతిలోకి తీసుకొని అపురూపంగా స్పృశించాడు. వాటికోసం ఎన్నోషాపులు గాలించాడు. కొత్త కొత్త మోడల్స్‌లో తయారైన బొమ్మలెన్నో వున్నాయి. కానీ తనక్కావలసిన ఆ క్రిస్టల్ పక్షి పిల్లలెక్కడా దొరకలేదు. స్వరోస్కి క్రిస్టల్ కంపెనీ వాళ్లు పదేళ్ల క్రితం తయారు చేసిన సెట్టు అది. ఇప్పుడెక్కడా మార్కెట్‌లో దొరకడం లేదు. ఇక లాభం లేదని తను నిరాశపడుతున్న తరుణంలో ఓ ఫ్రెండ్ ఇంట్లో షోకేసులో కనపడ్డాయి అవి. ఎప్పుడూ ఎవర్నీ ఏదీ అడగని తను "ఆ క్రిస్టల్ బర్డ్ సెట్ నాకిస్తావా? దానికి బదులుగా నువ్వేదడిగినా ఇస్తాను...." అన్నాడు ఫ్రెండ్‌తో.. అడిగిన వెంటనే ఆ పక్షి బొమ్మల్ని తన చేతిలో పెట్టాడు.. ఇలా ఆలోచిస్తూనే లూయిస్ పక్షిపిల్లల్ని ఓసారి పెదాలతో సుతారంగా ముద్దాడి ఓ చిన్న అట్టపెట్టెలో వుంచాడు. చిన్నచిన్న స్పాంజి ముక్కలను అందులో సర్ది ఆ అట్టపెట్టెను నీట్‌గా ప్యాక్ చేశాడు. తాను పంపుతున్న ఆ క్రిస్మస్ గిఫ్ట్ చూసుకొని హరిణి థ్రిల్ అవుతుంది. ఆమె విశాలమైన ఆ కళ్లు ఆ క్రిస్టల్ బొమ్మల్లాగే తళతళలాడతాయేమో...! ఆ వూహకే అతని కళ్లు మెరిశాయి. తాను ఒకే ఒక్కసారి చూశాడామెను. అతని మనసు గతంలోకి వెళ్లింది.

***

లూయిస్ పిట్స్‌బర్గ్ యూనివర్శిటీలో సైకాలజీ ప్రొఫెసర్. అతనికి పుస్తక పఠనం పట్ల ఆసక్తి... ఎన్నో పుస్తకాలు చదివాడు. విభిన్న సంస్కృతులూ, జీవన శైలి తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో ప్రపంచ యాత్ర చేశాడు. ఎన్నో భాషలు నేర్చాడు. ఆసియా ఖండంలో పర్యటిస్తున్నప్పుడు నైతిక విలువలలో భారతీయులను మించిన వారు లేరనే అభిప్రాయం కలిగిందతనికి. మార్గదర్శనం కోసం చాలా రోజులు ఇండియాలోనే వున్నాడతను. పవిత్ర వేదాలలో వుండే విజ్ఞానం కోసం అన్వేషించాడు. ఆత్మ, సృష్టి, ప్రకృతిల మధ్య సంతులనం పాటించాలన్న వేద సూక్తిని అధ్యయనం చేస్తూ కాశీ నుండి కన్యాకుమారి దాకా పర్యటించాడు. ఆ పర్యటనలో భాగంగా తిరుమలలోని వేదపాఠశాలలను సందర్శించాడు. అక్కడ ఓ సెక్యూరిటీ ఆఫీసరు నాయుడు పరిచయం అయ్యాడు. అతను తిరుమలలో సందర్శించదగ్గ ప్రదేశాలన్నీ లూయిస్‌కి చూపించాడు. ప్రకృతి సహజంగా ఏర్పడ్డ శిలాతోరణం




చూడ్డానికి వెళ్లాడు. లూయిస్‌కి అక్కడి ప్రశాంత వాతావరణం ఎంతో నచ్చింది. కాసేపు అక్కడ గడపాలని అనిపిస్తోందని నాయుడుతో చెప్పాడు. "అయితే మీరిక్కడే వుండండి. నేను క్యాంటీన్‌కి వెళ్లి ఫ్లాస్కులో టీ తెస్తాను అంటూ వెళ్లాడు నాయుడు. లూయిస్ అక్కడే వున్న మెట్టుపై కూర్చున్నాడు. అప్పటికే అక్కడ ఓ రెండు మెట్ల కిందుగా వున్న మరో మెట్టుపై ఎవరో ఇద్దరు స్త్రీలు కూర్చుని వున్నారు. వాళ్లేదో మాట్లాడుకుంటున్నారు. ఓ స్త్రీ కంఠంలో ఎంతో దుఃఖం వుంది. లూయిస్ చెవులు అసంకల్పితంగా వాళ్ల సంభాషణ వింటున్నాయి.

"ప్లేన్ క్రాష్‌లో మహీధర్ పోయి అప్పుడే పదేళ్లవుతోంది. ఆ దుఃఖాన్ని దిగమింగుకుని నా దృష్టంతా పిల్లలపై పెట్టాను. వాళ్లే లోకంగా బతికాను. నన్నొదిలి వెళ్లారన్న బాధ కంటే ఆ దూరదేశంలో వాళ్లెలా వున్నారో అన్న దిగులే ఎక్కువగా వుంది. ఆదర్శ్‌కి చీకటంటే చాలా భయం. రాత్రిళ్లు మెలుకువ వస్తే కనిపించే చీకటిని చూసి భయపడి "మమ్మీ" అంటూ నా దగరకి చేరేవాడు. 'అదితికైతే నేను కలిపి పెడితేనే కానీ ముద్ద దిగదు. అట్లాంటిది...అక్కడ...

"వాళ్లు బాగానే వుంటారు హరిణీ... దే ఆర్ గ్రోన్ అప్ నౌ...."

"నిజమే వాళ్లు బాగానే వుంటారేమో...! కానీ నేను వాళ్లని అనుక్షణం మిస్సవుతున్నాను. చానాళ్ల క్రితం... అన్నయ్య క్రిస్టల్‌తో తయారైన పక్షుల సెట్టు కానుకగా ఇచ్చాడు. తల్లి పక్షితో పాటు రెండుపక్షి పిల్లలు. త్రీపీస్ సెట్టు అది. ఎంతో ముచ్చటగా వుంది.

"సింగపూర్‌లో షాపింగ్‌కి వెళ్లినప్పుడు షోకేస్‌లో ఆ సెట్టు చూస్తే నువ్వూ నీ పిల్లలూ స్ఫురణకు వచ్చారే హరిణి. నా కెంతోనచ్చింది. వెంటనే కొనేసాను." అన్నాడు. నాకూ ఆ సెట్ ఎంతో నచ్చింది. ముఖ్యంగా ఆ పక్షి పిల్లలు మిలమిలలాడుతూ భలే ముద్దొస్తున్నాయి. నేను వాటిని షోకేసులో పెట్టాను. మా ఇంటికి ఎవరన్నా గెస్ట్‌లు వచ్చినప్పుడు ఆ షోకేస్ వైపు చూడడం తటస్థిస్తే వాళ్ల దృష్టి మిలమిలా మెరిసిపోయే ఆ క్రిస్టల్ పక్షులపై నిలిచేది. "భలే ముచ్చటగా వుంది, ఎక్కడ తీసుకున్నారూ..." అడిగే వారు. ఆదర్శ్‌కి ఇంటర్లో స్టేట్ ర్యాంకు వచ్చినప్పుడు నేను విందు ఏర్పాటు చేశాను. చాలా మంది గెస్ట్‌లువచ్చారు. విందు ముగిసింది. అందరూ వెళ్లిపోయారు. మరునాడు ఉదయం నేను ఎప్పట్లా లేచాక చూస్తే షోకేసులో ఆ రెండు పక్షి పిల్లలూ లేవు. పెద్ద పక్షి మాత్రం వుంది ఒంటరిగా.. ఒక్క క్షణం ఆ ఒంటరి పక్షినిచూసి షాక్ అయ్యాను. మిలమిలాడుతూ ముద్దొచ్చే ఆ పక్షిపిల్లలేవి? ఎంతో వెదికాను. ఎక్కడా లేవు. బహుశా ఎవరో ఆకతాయి పిల్లలో....లేదా కేటరింగ్ మనుషులో తీసేసి వుంటారు? నాకెంతో ప్రాణప్రదమైన ఆ పక్షిపిల్లలను పోగొట్టుకోవడాన్ని తట్టుకోలేకపోయాను. ఆ దిగులుతో వుండగానే ఆదర్శ్ అనుకోకుండా వచ్చిన అవకాశాన్నందుకొని జర్మనీ వెళ్లాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే అదితి వెళ్లిపోయింది. నాకిప్పుడు షోకేసులో ఒంటరిగా మిగిలిన ఆ పక్షిని చూస్తే చెప్పలేనంత దిగులు వేస్తుంది....

"షిట్...హరిణీ.... ఆఫ్టాల్ గాజుబొమ్మలు పోతే

ఇంతలా ఫీలవడం ఏమిటి? నువ్వా ఒంటరి పక్షిబొమ్మను చూడలేకపోతే ఏ నదిలోనో గిరాటు వెయ్యి. ఇంత సెంటిమెంట్ పనికిరాదు. ఇంకా నువ్వే యుగంలో వున్నావు.. బి...ప్రాక్టికల్... పిల్లలు పై చదువుకు దూరదేశం వెళ్లడం అనేదిచాలా సహజమైన విషయం.

"నిజమేకానీ వాళ్లు నాకు చాలా దూరంలో వున్నారు...అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను.

"హరిణీ నువ్వసలు ఒంటరితనంతో బాధపడుతున్నావు. పోనీ నాతో చండీఘర్ వచ్చి కొన్నాళ్లుండకూడదూ...కాస్త మార్పు వుంటుంది." అన్నది.

నేనురాను అన్నట్టుగా తల ఊపింది హరిణి

"పద హరిణీ చీకటి పడుతుంది." అంటూ లేచింది పసుపు రంగు చుడీదార్ కుర్తా వేసుకున్న ఆవిడ.

ఇప్పటిదాకా ఏడుస్తూ మాట్లాడిన ఆమె మాత్రం అలాగే కూర్చుండిపోయింది. లూయిస్ ఆమె వంకే చూస్తున్నాడు. ఆ హరిణి అన్న ఆవిడ నలుపురంగు చీర కట్టుకొని వుంది. ఆ చీరపై అక్కడక్కడా కుట్టిన అద్దాలు మసక చీకట్లో మిలమిలా మెరుస్తున్నాయి. వెనక నుంచి చూస్తే ఆమె చెక్కిన శిల్పంలా వుంది. ఆమె వీపుపై నుండి నడుము వరకూ వదిలేసిన జుట్టు జలపాతాన్ని తలపిస్తుంది.

"హరిణి పద వెళదాం...అంటూ పసుపు రంగు చుడీదార్ వేసుకున్న ఆవిడ అనడంతో ఆమె మెల్లగా లేచింది. వాళ్లు నార్త్ ఇండియన్స్‌లా అనిపిస్తున్నారు. వాళ్లసంభాషణ అంతా ఇంగ్లీషులో సాగింది. లూయిస్ కెందుకో ఆ నల్లచీర కట్టుకున్న హరిణీ అన్నావిడ ఓసారి ఇటు తిరిగితే బావుండును అనుకున్నాడు.

ఆమె అడుగు ముందుకు వేసింది. ఆమెకొంగు మెట్లకు ఓ పక్కగా వున్న గులాబీమొక్కకు చిక్కుకు పోవడంతో వెనక్కి లాగినట్టయ్యి ముందుకు తూలిపడబోయింది. అది గమనించిన లూయిస్ చటుక్కున వచ్చి చిక్కుకున్న ఆమెకొంగు ముళ్ల నుంచి తప్పించి మొక్క నుంచి వేరు చేశాడు.

"మహానుభావుడెవరో కానీ ఏదో కారణం వల్ల అజ్ఞాతంగా వుండాలనుకుంటున్నాడని అర్థం చేసుకున్నాను. ప్రతి వుత్తరంలోనూ బహుశా ఇదే ఆఖరి వుత్తరం అవుతుందేమో...? అనే వాక్యం వుంటుందీ మధ్య... కానీ ఆఖరి వుత్తరం ఏదీ కాదు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరని ఆ వుత్తరాలు... చదివిన ప్రతిసారీ కొత్తగానే అనిపిస్తాయి. ఎప్పటికీ తరగని నిధి లాగా మిగిలి పోతాయి..."

ఆమె వెనక్కి తిరిగింది.

తారలు చమక్కు మంటున్న నల్లని ఆకాశం చుట్టబెట్టుకున్నట్టున్న ఆవిడ ముఖం చంద్రబింబంలా వుంది. కానీ విశాలమైన ఆమె కళ్లల్లో చెప్పుకోలేనంత దిగులు.... లూయిస్‌కి అమ్మ ముఖం గుర్తుకు వచ్చింది. ఆవిడ అవసాన దశలో తండ్రీ, తోబుట్టువులు లేని తనని ఒంటరిగా వదిలి వెళ్లిపోతున్న దిగులు... ఇప్పుడు హరిణి కళ్లలోనూ దిగులే... తాను ఒంటరి దాన్నన్న దిగులు.

ఆమె లూయిస్‌కి థ్యాంక్స్ చెప్పింది.

వాళ్లు వెళుతున్నారు. ఇంతలో నాయుడు వచ్చాడు.

"మిస్టర్ నాయుడూ వీళ్లెవరో తెలుసుకోగలరా?" అడిగాడు లూయిస్.

ఆ పసుపు రంగు చుడిదార్‌లో వున్నావిడ అనుష్క. డిఎఫ్ఓ అనురాగ్ చెల్లెలు. చండీఘర్ నుంచి వచ్చారావిడ అన్నాడు.

"అభ్యంతరం లేకపోతే నేనో సారి కలవచ్చా" అన్నాడు లూయిస్

***

మరునాడు తిరుపతిలో ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్ ఇంటికి వెళ్లారు. అనుష్క లూయిస్‌ని పరిచయం చేశాడు నాయుడు. బాగా కుంకుమ పువ్వు వేసి మరగకాచిన పాల వంటి రంగులో పొడుగ్గా వున్నాడతను. నీలి కళ్లు, రాగి రంగుజుట్టు పెదాలపై చెరగని చిరునవ్వు, ప్రశాంతత ఉట్టి పడుతున్న ముఖం... చూడగానే అతని పట్ల సదభిప్రాయం ఏర్పడింది అనుష్కకి.

"నిన్న సాయంత్రం మీతో వున్నావిడ...." అతని మాటలుపూర్తికాకముందే...

"హరిణి నా స్నేహితురాలు. ఈ రోజు వుదయమే హైదరాబాద్ బయల్దేరి వెళ్లింది" అంది అనుష్క.

"హరిణి మీతో మాట్లాడుతుంటే విన్నాను.పరిస్థితి అర్థమయింది. ఆమె చుట్టూ ఆవిడే స్వయంగా నిర్మించుకుంటున్న సజీవ సమాధిని నిర్మూలించాలి. ఆ పని సత్వరమే జరగాలి" అన్నాడతను.

"నిజమే కానీ అది మా ఎవరి వల్లసాధ్యం కాలేదు. అసలు ఆమె భర్త పోయినప్పుడుకూడా హరిణి ఇంతగా కుంగి పోలేదు. పిల్లలిద్దరూ ప్రయోజకులైనారన్న సంతోషం కంటే తనను వదిలి వెళ్లారన్న దుఃఖమే ఎక్కువగా వుంది. నాకది అసహజంగానూ, స్వార్థపూరితంగానూ అనిపిస్తుంది. ఈ భూప్రపంచంలో ఎందరో తల్లులకు ఇలాంటి పరిస్థితే ఎదురవుతూనే వుంటుంది. అందరూ ఇలాగే ప్రవర్తిస్తారా...." అడిగింది అనుష్క.

"మీరనుకున్నట్టుగా హరిణి ప్రవర్తనలో స్వార్థమూ, అసహజమూ ఏమాత్రమూ లేదు. ఇక్కడ హరిణి చిన్నవయసులోనే భర్తను పోగొట్టుకుంది. అదో దురదృష్టకరమైన సంఘటన. అప్పటినుంచి ఆమె అనుక్షణం తన దృష్టిని పిల్లలపై సారించింది. తల్లీదండ్రీ తానే అయ్యి వాళ్లను ప్రయోజకులుగా తీర్చి దిద్దింది. తనతోనే వాళ్లుండిపోవాలన్న స్వార్థం వున్నట్టయితే వాళ్లు వెళ్లడానికి అంగీకరించేది కాదు. వాళ్లు ప్రయోజకులై ఒక్కొక్క మెట్టే అధిగమిస్తూంటే తనకు దూరంగా మరింత దూరంగా అవుతారన్న అభద్రతాభావం వున్నా కూడా పిల్లలు అనుకున్నది సాధించాలనే కోరుకుంది. మనం చెయ్యాల్సిందల్లా ఆవిడ చుట్టూ వున్న కోటగోడలాంటి ఒంటరితనాన్ని దూరం చేయడమే. నాకో అవకాశమివ్వండి...

ఆ రోజు అనుష్క ఇచ్చిన హరిణి అడ్రసుకు వుత్తరాలురాస్తూనే వున్నాడు. గతంలోంచి ఈ లోకం లోకి వచ్చిన లూయిస్ కవర్లో పెట్టిన వుత్తరం నీట్‌గా ప్యాక్ చేసిన గిఫ్ట్ చేతిలోకి తీసుకున్నాడు. కిటికీలోంచి దూరంగా కొండల మధ్య పిట్స్‌బర్గ్ వేంకటేశ్వరాలయం కనపడుతూంది. అసంకల్పితంగా అతను చేతులు జోడించాడు. అస్పష్టంగా గుడి గంటల శబ్దం వినిపించింది.

బహుశా హరిణికి ఇదే నా ఆఖరి వుత్తరం కావచ్చు...అనుకున్నాడతను.

***

లూయిస్ కళ్లు బరువుగా మూసుకుపోతున్నాయి. ఫోన్ మోగుతోంది. మంచం పక్కన సైడ్ టేబుల్‌పై నున్న ఫోన్ తీశాడు.

"హలో...లూయిస్ నేను అనుష్క..." ఆమె కంఠంలో ఉద్వేగం... ఆమె చెప్పుకు పోతూనే వుంది. లూయిస్ నేను హైదరాబాద్ వెళ్ళొచ్చాను. హరిణిని కలిసాను. నువ్వేం ఇంద్రజాలం చేశావో గానీ ఆమెలో చెప్పలేనంత మార్పు వచ్చింది. ఆనాటి స్తబ్దత, దిగులు మచ్చుకి కనపడడంలేదు.

అతను మౌనంగా వింటున్నాడు. ఆమె చెబుతూనే వుంది. నీకు వుత్తరాలు రాసే వ్యక్తి ఎవరో తెలుసుకోవాలని లేదా? అని హరిణిని అడిగాను. ఆమె చెప్పేది వింటూన్న అతని ముఖంలో ఆతృత కనిపించింది.

"ఆ వ్యక్తి ఎవ్వరైతేనేం నాకా ఎగిరేపక్షుల్లో, కదిలే గాలిలో, విచ్చుకుంటున్న పూలల్లో, గానంలో, వాయిద్యాల్లో,పుస్తకాల్లో, రంగుల్లో అంతటా తానే అయి కనిపిస్తున్నాడు. ఆ వ్యక్తిని ఓ పేరుకో, రూపానికో పరిమితం చేయడం ఎందుకు?" అన్నదామె.

అయితే కనీసం ఆ వ్యక్తికి కృతజ్ఞత తెలపాలనిపించలేదా! అని అడిగాను.

"జీవితాన్ని ప్రేమించడం నేర్పిన వాళ్లపట్ల కృతజ్ఞత తెలపడం, ఋణం తీర్చుకోవడం అనేది చాలా అల్పమైన పదాలు అవుతాయి. అంధకారంలో కూరుకుపోతున్న నా మనసును రంగుల కలలాంటి జీవితం వైపు మళ్లించిన ఆ వ్యక్తి నీకు తెలిసిన వాడై వుంటారని నేను ముందే ఊహించాను. మహానుభావుడెవరో కానీ ఏదో కారణం వల్ల అజ్ఞాతంగా వుండాలనుకుంటున్నాడని అర్థం చేసుకున్నాను. ప్రతి వుత్తరంలోనూ బహుశా ఇదే ఆఖరి వుత్తరం అవుతుందేమో...? అనే వాక్యం వుంటుందీ మధ్య... కానీ ఆఖరి వుత్తరం ఏదీ కాదు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరని ఆ వుత్తరాలు... చదివిన ప్రతిసారీ కొత్తగానే అనిపిస్తాయి. ఎప్పటికీ తరగని నిధిలాగా మిగిలిపోతాయి..." హరిణి అన్న మాటలు అనుష్క చెబుతుంటే వింటున్న అతని పెదాలపై చిరునవ్వు...హరిణిలో నేననుకున్న మార్పు వచ్చింది...థాంక్‌గాడ్...అతని పెదాలు కదలిక ఆగిపోయింది. కళ్లు మూసుకుపోతున్నాయి.

"హలో.." అటువైపు అనుష్క కంఠంలో ఆదుర్దా

ఇటు వైపు....మౌనం...

లూయిస్....లూయిస్....హలో....

అనుష్కకు అర్థం అయింది ప్రాణాలుహరించివేస్తున్న లుకేమియాతో పోరాడుతున్న లూయిస్ ఊపిరి ఆగిపోయిందని. కన్నీళ్ల మధ్య కిటికీ అవతలి నుండి మసకమసకగాకనిపిస్తున్న చర్చి వంక చూసింది. లూయిస్ ఆత్మకు శాంతి కలిగించమని మౌనంగా ప్రార్థించింది.

ఆమె కోరిక మన్నిస్తున్నట్లుగా చర్చి గంట వినిపించింది. ఆ శబ్దం గూటికి చేరుకున్న పక్షిపిల్లలా ఆమెను ఆవరించింది.

★